క్లుప్తంగా

బీమా సొమ్ము అందజేత



బాధితురాలికి నగదు అందజేస్తున్న సూర్యనారాయణరెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక సంతపేటకు చెందిన మృతుని కుటుంబానికి శుక్రవారం బీమా సొమ్ము అందజేశారు. కాలనీకి చెందిన ఉసేన్‌వలి ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. మృతుడు వైఎస్సార్ బీమా పాలసీదారుడు కావడంతో రూ. 5 లక్షల ప్రమాద బీమా వర్తించింది. తక్షణ సాయంగా మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో రూ. 10 వేలను మృతుని భార్య హసీనాకు అందజేశారు. మిగిలిన రూ. 4.90 లక్షల మొత్తం నామిని ఖాతాలో జమ అవుతుందని వెల్ఫేర్ అసిస్టెంట్ రోషిరెడ్డి పేర్కొన్నారు.

రోడ్డు వెడల్పు పనులతో నీటి సరఫరాకు అంతరాయం



పైపులైన్ మార్చే పనులను పరిశీలిస్తున్న చైర్మన్

డోన్ : పట్టణ శివారులోని పేరంటాలమ్మ గుడి వద్ద నుంచి ఉలిగమ్మ గుడి వరకు రోడ్డును 43 అడుగుల వెడల్పు చేస్తున్న పనులతో మంచినీటి సరఫరాకు అంతరాయం కలిగిందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రోడ్డు వెడల్పులో భాగంగా పైపులైన్లను మార్చే పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. పాతరోడ్డు కింద ఉన్న పైపులైన్లను ఆర్‌అండ్‌బీ వారు కొత్త డీపీ పైపులను పక్కకు జరిపి మార్చే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయినందువల్ల నెహ్రూనగర్, టీఆర్ నగర్, సుందర్సింగ్ కాలనీలకు మంచి నీటిని అందిస్తున్నామన్నారు. త్వరలోనే మిగిలిన ప్రాంతాలకు కూడా పైపులైన్లను ఏర్పాటుచేసి మంచినీటిని నిరంతరంగా అందిస్తామని ఆయన వివరించారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



పీర్ల పెట్టెను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

ప్యాపిలి: స్థానిక చిల్లకట్ట సెంటర్ వద్ద వెలసిన దస్తగిరి స్వామి పీర్ల పెట్టెకు శుక్రవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. మొహర్రం వేడుకల్లో భాగంగా నిర్వహించిన గ్రామోత్సవం పట్టణ ప్రధాన వీధుల మీదుగా సాగింది. ప్రజలు స్వామి వారికి చక్కెర చదివింపులతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక చావిడిలో పీర్ల స్వాములను కొలువుంచారు. తొమ్మిది రోజులు పాటు జరిగే మొహర్రం ఉత్సవాలు ఈ నెల 29 వ తేదీతో ముగియనున్నాయి.

పీర్ల చావిళ్లు ముస్తాబు

కొలిమిగుండ్ల: మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం వేడుకలకు మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల చావిళ్లు ముస్తాబవుతున్నాయి. ప్రత్యేకించి తిమ్మనాయినపేట, మీర్జాపురం, నందిపాడు, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరుగుతాయి. పీర్లచావిడికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దుతున్నారు.విద్యుద్దీపాలతో అలంకరించనున్నారు. రాత్రి హుసేన్‌స్వామితో పాటు ఇతర స్వాముల పీర్లను కొలువు దీర్చారు. 26న చిన్న సరిగెత్తు, 28న పెద్ద సరిగెత్తు, 29న పీర్ల నిమజ్జనం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

23న రక్తదాన శిబిరం

బేతంచెర్ల: పట్టణంలో ఈనెల 23వ తేదిన బేతంచెర్ల లైఫ్ యువనేత్ర సమితి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సభ్యులు శుక్రవారం తెలిపారు. రక్తదాత కైప ప్రతాప్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించే మెగా రక్తదాన శిబిరంలో యువకులు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు 'జగనన్న సురక్ష'

కోవెలకుంట్ల: మేజర్ గ్రామ పంచాయతీ కోవెలకుంట్ల పరిధిలోని నాల్గవ గ్రామ సచివాలయ ఆవరణలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాధిక తెలిపారు. అర్హతలు ఉండి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వర్తించని కుటుంబాలకు పథకాలు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమానికి ఏపీఐడీసీ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్ రెడ్డి, సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీ ఆర్ సూర్యనారాయణరెడ్డి తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు.

గిద్దలూరులో..

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు గ్రామం సచివాలయ ఆవరణలో శనివారం జగనన్న సురక్ష సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు.అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని పేదలను గుర్తించడంతోపాటు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులో మార్పు తదితర 11రకాల ప్రభుత్వ సేవలను సంబంధించి వివరాలు పరిశీలించి వెంటనే సర్టిఫికెట్ అందజేస్తారని ఎంపీడీఓ తెలిపారు.





బనగానపల్లె, కోవెలకుంట్లలో ఆర్టీసీ డిపోల్లో సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం

బనగానపల్లె: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం.. హైయ్యర్ పెన్షన్ అమలు... ఉద్యోగులకు, కార్మికులకు అండగా నిలుస్తున్న తీరును హర్షిస్తూ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. బనగానపల్లె ఆర్టీసీ డిపో ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజర్ రవికిశోర్ ఉద్యోగులు, కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వ పరం చేశారని గుర్తు చేశారు. సీఎం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులకు మంచి వేతనాలు లభించడంతో పాటు పదవీవిరమణ పొందాక పింఛన్ కూడా సంతృప్తిగా లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకటన్న ఏఎంఎఫ్ నాగరాజు, జోనల్ వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీపతి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రసాదరెడ్డి, పుల్లయ్య, రాయుడు, సత్యం, సెక్యూటీ సిబ్బంది గుర్రప్పగౌడ్, కౌసర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని కోవెలకుంట్ల డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ రవికిషోర్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో శుక్రవారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులను చేసి ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు అందిస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివరాం, ఎస్టీఐ కిషోర్‌కుమార్, యూనియన్ నాయకులు నరసింహ, గిరి, సుబ్రహ్మణ్యం ఆచారి తదితరులు పాల్గొన్నారు.

తలుపు తట్టి సాయం....

ఈ చిత్రంలో ఓ మహిళకు మందులు అందజేస్తున్న సయ్యద్ జాకీర్ పట్టణ పరిధిలోని శివనందినగర్ వలంటీర్. కరోనా కష్టకాంలోనూ వలంటీర్లు ప్రజలకు అంకితభావంతో సేవలందించారనేందుకు ఈ చిత్రం ప్రత్యక్ష సాక్ష్యం. తమ పరిధిలోని యాభై కుటుంబాలకు వలంటీర్లు నిస్వార్థంగా సేవందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ప్రత్యేకించి కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు ప్రజలు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలు బయటకు రాలేని పరిస్థితులు. అయినా వలంటీర్లు సేవాదృక్పథంతో ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రభుత్వం అందజేసిన సాయంతోపాటు దాతల నుంచి సేకరించిన నిత్యావసర సరుకులు అందజేసి ప్రజలకు అండగా నిలిచారు. ప్రత్యేకించి కరోనా బాధితులు, వృద్ధులకు వలంటీర్లు నిత్యం అందుబాటులో ఉంటూ తమవంతు సేవలందిస్తూ మనోధైర్యాన్ని కల్పించిన తీరును నేటికీ గుర్తు చేసుకుంటున్నారు ప్రజలు. – బనగానపల్లె



కరోనా సమయంలో మందులు అందజేస్తున్న వలంటీర్ సయ్యద్‌జాకీర్

కష్టకాలంలో ఆదుకున్నారు....



ఇంటి తలుపు తట్టి అందజేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయం. ప్రత్యేకించి కరోనా కష్టకాలంలో వలంటీర్లు చేసిన సేవలను ఎవ్వరూ మరిచిపోరు. ముగ్గురు సంతానంతో చిల్లర దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న తనకు మా వలంటీర్ సయ్యద్ జాకీర్ అన్నివిధాలా అండగా నిలిచాడు. నిత్యావసర సరుకులు, పింఛన్, ప్రభుత్వ సాయం ఇంటివద్దకే వచ్చి అందజేసి ఆదుకున్న వలంటీర్ సేవలను ఎప్పటికీ గుర్తుంటాయి.

– ఎస్ సాహేజా శివనందినగర్ బనగానపల్లె

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ మోహన్ రెడ్డి సమాన ప్రధాన్యనిస్తూ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలో రెండవ రోజు శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు సంక్షేమ పథకాలు అందాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై గ్రామస్తులతో ఆరా తీశారు. సీసీ రోడ్లు నిర్మించాలని, కరెంట్ స్తంభాలు వంగిపోయాయని ఆయా కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రజా సంకల్ప పాదయాత్ర ద్వారా పేదల కష్టాలను తెలుసుకొని నవరత్నాల ద్వారా అనేక సంక్షేమ పథకాలను అందించి ఆదుకుంటున్నారని తెలిపారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను కళ్లారా చూసి గ్రామాల అభివృద్ధికి సంకల్పించారని తెలిపారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో, హౌసింగ్ ఏఈలు పక్కీరయ్య, క్రిష్ణారెడ్డి, సర్పంచ్ కొమ్ముసాని మహాలక్ష్మి, మాజీ ఎంపీటీసీ కొమ్ముసాని చిన్న కంబగిరిస్వామి, అవుకు మండల సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, నాయకులు కొమ్ముసాని పెద్ద కంబగిరి స్వామి, శేషఫణి శెట్టి, శంకర్, పుల్లయ్య, ఈడిగ వెంకటరాముడు, అయ్యపురెడ్డి, నరేంద్రరెడ్డి, మంచాల నాగేశ్వర రెడ్డి, పార్థు, పురుషోత్తం నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన పకడ్బందీగా చేపట్టాలి

- యాప్‌లో ఓటరు వివరాలు సక్రమంగా నమోదు చేయాలి
- ఆర్డీఓ వెంకటరెడ్డి



యాప్‌లో ఓటరు వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ

ప్యాపిలి: ఓటరు జాబితా పరిశీలన ఇంటింటికీ వెళ్లి పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ వెంకటరెడ్డి సూచించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలో ఇళ్ల వద్దకు వెళ్లి ఓటరు వివరాలను యాప్‌లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో శుక్రవారం జరుగుతున్న ఓటరు జాబితా వెరిఫికేషన్ ప్రక్రియను ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బీఎల్‌ఓలను ఉద్దేశించి మాట్లాడారు. ఇంటింటి సర్వేలో ఏమాత్రం అలసత్వం వహించరాదన్నారు. రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉన్న వారిని గుర్తించి ఒకటి తొలగించాలన్నారు. అదేవిధంగా మరణించిన వ్యక్తుల పేర్లను జాబితా నుంచి తొలగించాలని, జాబితాలో పేర్లు, చిరునామా తప్పులు ఉంటే ఓటరుతో మాట్లాడి సక్రమంగా నమోదు చేయాలన్నారు. వలస వెళ్లిన వారిని గుర్తించి వారితో మాట్లాడాలన్నారు. తిరిగి వారు స్వస్థలానికి రాలేని పరిస్థితి ఉంటే వారి పేర్లు కూడా జాబితా నుంచి తొలగించాలని చెప్పారు. నెల రోజుల పాటు జరిగే ఈ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

అవుకు: పారదర్శక ఓటర్ జాబితా ప్రక్రియను పగడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ వెంకట రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రం అవుకులోని అగ్రహారం వీధిలో జరుగుతున్న ఓటర్ జాబితా వెరిఫికేషన్‌ను ఆర్డీఓ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఓటర్ల జాబితా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. అదేవిధంగా వివాహమై ఆ ఇంట్లో ఉన్న మహిళలకు, ప్రస్తుతం 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటు హక్కు జాబితాలో చేర్చాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో రెవెన్యూ సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాముడు, వీఆర్‌ఓ చంద్రహాస్ రెడ్డి, ఎలక్షన్ ఆపరేటర్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

డోన్ టౌన్ : ఓటర్ల జాబితాపై శుక్రవారం ప్రారంభమైన ఇంటింటి సర్వే ప్రక్రియను డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి తనిఖీ చేశారు. పట్టణంలోని పోలింగ్ స్టేషన్ నంబరు 114 పరిధిలో సర్వేను పరిశీలించి రెవిన్యూ అధికారి యూనుస్‌కు సూచనలు చేశారు. ఇంటింటా తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలను జాబితాతో సరి పోల్చాలని ఆర్డీఓ సూచించారు. కొత్త ఓటర్లను గుర్తించే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు,సెల్ ఫోన్లో యాప్‌లో నమోదు తీరు, చేర్పులు, తొలగింపు ప్రక్రియను వివరించారు.

బేతంచెర్ల: ఓటరు వెరిఫికేషన్‌ను బాధ్యతగా నిర్వహించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం బీఎల్‌ఓలు, సూపర్ వైజర్లతో సమావేశమైన తహసీల్దార్ ఓటరు పరిశీలనపై సూచనలు చేశారు. మండలంలో 86 బూత్‌లకు 86 మంది బీఎల్‌ఓలు, 17 మంది సూపర్ వైజర్ల పర్యవేక్షణలో ఆగస్టు 21 వరకు ఓటర్ వెరిఫికేషన్ చేపట్టాలన్నారు. అనంతరం పట్టణంలోని 1నుంచి 4 వార్డుల వరకు 6మంది బీఎల్‌ఓలు, సూపర్ వైజర్ ఇంటింటికీ తిరిగి ఓటరు వెరిఫికేషన్ చేశారు.

సర్వేను పరిశీలించిన తహసీల్దార్

కొలిమిగుండ్ల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పక్కాగా ఓటర్ల జాబితా తయారు చేయాలని తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్ అన్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఇంటింటి సర్వేను తహసీల్దార్ పరిశీలించి బీఎల్‌వోలకు సూచనలు చేశారు. ఆగస్టు 20వ తేదీ వరకు సమగ్ర ఓటర్ సర్వే జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు. 2024 జనవరి 1వ తేదికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామన్నారు.

పీఎం రాజీనామా చేయాలి

డోన్ టౌన్ : మణిపూర్‌లో చెలరేగిపోతున్న హింసలకు నైతిక బాధ్యత వహిస్తూ పీఎం నరేంద్రమోడీ, మణిపూర్ సీఎంబీరేన్ సింగ్‌లు తక్షణమే రాజీనామ చేయాలని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుగుణమ్మ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలకు నిరసనగా శుక్రవారం మహిళా సమాఖ్య పిలుపు మేరకు స్థానిక గుత్తి రోడ్డులో ఉన్న అమ్మ హోటల్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, మహిళ సమాఖ్య నాయకురాళ్లు పాల్గొన్నారు.

బేతంచెర్ల: మణిపూర్ ఘటనలను నిరసిస్తూ శుక్రవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో రస్తారోకో నిర్వహించారు. మణిపూర్‌లో కుకీ మహిళలను వివస్త్రను చేసి సామూహికంగా అత్యాచారం చేయడం యావత్ భారత దేశానికి మాయని మచ్చలా నిలిచిపోయిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకురాలు షేఖారాణి, గుల్జార్‌బీ, హైమావతి ఆందోళన వ్యక్తం చేశారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

డోన్ టౌన్ : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అన్వర్, డోన్ మండల అధక్షులు వెంకటేష్ గౌడ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పాత బస్టాండ్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న పెట్రోల్,డీజిల్ ధరల వలన ఇబ్బందులు పడుతున్నామని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, బద్రీ, పూలమధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుమారుడిసహా తల్లి అదృశ్యం

కోవెకుంట్ల: స్థానిక జెండా చెట్టు వీధిలో నివాసం ఉంటున్న ఓ వివాహిత కుమారుడితో సహా అదృశ్యమైంది. శుక్రవారం ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. పట్టణానికి చెందిన నాయుడికి రుద్రవరం మండలం చింతరేనిపల్లెకు చెందిన పుష్పావతితో 14 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరి ఇద్దరు కుమారులు స్థానిక ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. ఈ నెల 19న కుటుంబ విషయాల్లో వాగ్వాదం చోటుచేసుకుని భార్యభర్తలు గొడవ పడ్డారు. ఈ క్రమంలో అదేరోజు మధ్యాహ్నం పాఠశాలలో పెద్దకుమారుడికి భోజన క్యారియర్ ఇచ్చి చిన్నకుమారుడితో సహా ఇంటి నుంచి వెళ్లి పోయింది. చుట్టుపక్కలా గాలించిన ఆ చూకీ తెలియకపోవడంతో భార్య బంధువులకు భర్త సమాచార మందించాడు. కుమార్తె, మనువడు కన్పించలేదని తల్లి సౌభాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామంలో ఈనెల 18న జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ శుక్రవారం తెలిపారు. యంబాయి గ్రామానికి చెందిన బోయ లక్ష్మీదేవి, రవి ఇంట్లో రెండు జతల బంగారు కమ్మలు చోరీకి పాల్పడిన కేసులో అదేగ్రామానికి చెందిన మంగలి వెంకటేష్ బేతంచెర్ల కొత్త బస్టాండులో అనుమానస్పదంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. కేసు నమోదు చేసి డోన్ కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

బేతంచెర్ల: స్థానిక సబ్ రిజిష్టర్ కాలనీ సమీపాన డబుల్ రహదారిలో శుక్రవారం నాపరాళ్ల ట్రాక్టర్, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో రుద్రవరం గ్రామానికి చెందిన వెంకటేష్, మండ్లవానిపల్లెకు చంద్రకు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరూ తహసీల్దార్ కార్యాలయం వద్దకు బైక్‌పై పనినిమిత్తం వస్తున్నారు. నాపరాళ్ల ట్రాక్టర్ లోడుతో బేతంచెర్లలోని అయ్యల చెర్వుకు వెళ్తూ బైక్‌ను ఢీ కొట్టింది.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న రమావత్ మంగీబాయి అనే మహిళ నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ శుక్రవారం తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ మేరకు ఆమెను రిమాండ్‌కు తరలించామని ఎస్ తెలిపారు.

జగనన్న విద్యా, వసతి దీవెనపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న చింతామణి

బనగానపల్లెరూరల్: స్థానిక పొదుపు భవనంలో శుక్రవారం బనగానపల్లె, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల, పాణ్యం మండలాల సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్స్‌తో పెండింగ్‌లో ఉన్న జగనన్న విద్య దీవెన, వసతి దీవెనలపై సాంఘీక సంక్షేమ శాఖ జిల్లా ఉపసంచాలకురాలు చింతామణి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చితామణి మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు సంబంధించి బ్యాంకు ఖాతతో ఆధార్, ఫోన్ నంబరు అనుసంధానం చేసి ఉండాలన్నారు. వీటిలో ఏ ఒక్కటి అనుసంధానం కాకున్నా విద్యార్థులు ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి నష్టపోతారన్నారు. ఈ నెల చివరిలోపు పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు సంబంధించి బ్యాంక్ ఖాతాలకు ఆధార్, ఫోన్ నంబర్లు అనుసంధానం చేయించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ దిలీప్‌బాషా, వార్డన్‌లు రఫీ, శ్రీనివాసరెడ్డి, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు లేవు... తప్పని ఇబ్బందులు



ఏపీజీబీ ఎదుట నిరీక్షిస్తున్న ఖాతాదారులు

డోన్ టౌన్ : పట్టణంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో రెండు రోజులుగా డబ్బు లేకపోవడంతో ఖాతాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అదే విధంగా యూనియన్ బ్యాంక్‌లోనూ క్యాస్ కొరత మూలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమసొమ్ము తాము తీసుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని ఖాతాదారులు వాపోతున్నారు. శుక్రవారం ఖాతాదారులు బ్యాంకుల ఎదుట పడిగాపులు కాస్తున్నారు. బ్యాంక్‌లో జరిగే లావాదేవీలను దృష్టిలో ఉంచుకొని మరుసటి రోజుకు అంచనాల ప్రకారం నగదు నిల్వలు ఉంచుకొకుండ కుంటి సాకులు చెబుతూ ఖాతాదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నిమిషం ఆలస్యం అయినా లోపలికి అనుమతించని సెక్యూర్టీ గార్డు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు ఖాతాదారులు. అయితే సమస్యపై ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీదేవి డబ్బుల కోసం కర్నూలుకు వెళ్లారని సిబ్బంది తెలుపగా ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రోజుకు రూ20లక్షలు మించి బ్యాంక్‌లో నగదు నిల్వలు ఉంచుకోకూడదని, దీంతో సమస్య ఏర్పడిందని యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ బోరెడ్డి చెప్పారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ప్రతిపల్లెకూ రహదారులు, తాగునీటి వసతి
- ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ : గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ భవనం ఆవరణలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన డోన్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు సభకు తెలిపారు. కామగానికుంట్ల నుంచి తమ గ్రామంతో పాటు స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు నిర్మించాలని ఆవులదొడ్డి సర్పంచ్ మద్దిలేటి ఎంపీపీని కోరగా ప్రతిపాదనలు పంపామని పీఆర్ ఏఈ నారాయణ తెలిపారు. డిసెంబర్ నాటికి జగనన్న హౌసింగ్ కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తిచేసుకునేలా ప్రతిఒక్కరూ సహకరించాలని ఏఈ నాగభూషణం కోరారు. ఐసీడీఎస్ సెంటర్ల పనితీరును ప్రాజెక్టు అధికారిని షంషాద్‌బేగం వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని, ప్రతి పల్లెకు రహదారులు, నీటి వసతని కల్పిస్తామన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి రూ.330 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలల్లో ఇంటింటికీ మంచినీటి సరఫరా ఏర్పాట్లు పూర్తకావచ్చాయని గుర్తు చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి ఇంటింటికీ పైపులైన్‌లు కూడా ఏర్పాటు చేశామన్నారు. మరో మూడు, నాలుగు నెలల్లో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో ఇంటింటికీ మంచినీటిని సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ అబ్దుల్‌షఫీ, సర్పంచ్‌లు బంగారు జయచంద్ర, చంద్రశేఖర్, కళ్యాణి, సుంకులమ్మ, రాధమ్మ, రాధ, గిడ్డారెడ్డి, నాగన్న, రామిరెడ్డి, రాముడు తదితరులు పాల్గొన్నారు.

రహదార్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి

- డ్వామా పీడీ రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

ప్యాపిలి: ఉపాధి హామీలో భాగంగా మండల వ్యాప్తంగా రహదార్లకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటాలని, దాదాపు 75 కిలోమీటర్ల నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో ప్యాపిలి-రాయలచెరువు, ప్యాపిలి-గుడిపాడు, ప్యాపిలి- పత్తికొండ రహదార్లకు ఇరువైపులా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. మొక్కలు నాటేందుకు, సంరక్షించినందుకు కూలీలకు వేతనం వస్తుందన్నారు. అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బాలకృష్ణుడు, వైఎస్సార్ సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, ఏపీఓలు వెంకటరమణ, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: ఉపాధి హామీ పథకం కింద రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణలో ప్రజలు, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేయాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీడీ శ్రీవిద్య, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బంది, గ్రామాల సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డోన్ నియోజకవర్గంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచన మేరకు నూతనంగా వేసిన రహదారులకు ఇరువైపులా 190 కిలోమీటర్లు మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బేతంచెర్ల మండలంలో 20 కిలోమీటర్లు 8వేల మొక్కలు నాటేందుకు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, టెక్నికల్ అసిస్టెంట్స్, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, గుమ్మగాలరాజు పాల్గొన్నారు.

పాఠశాలలకు పుస్తకాలు తరలింపు

కొలిమిగుండ్ల: ప్రభుత్వ ఆదేశాల మేరకు సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను ఎండీయూ వాహనాల్లో పాఠశాలలకు చేర్చుతున్నామని ఎంఈఓ రాజయ్య తెలిపారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్ నుంచి శుక్రవారం ఐదు ఎండీయూ వాహనాల ద్వారా మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు పుస్తకాలను చేరవేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకు ముందుగా తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి సెమిస్టర్ పుస్తకాలను పరిశీలించి ఎండీయూ వాహనాలను ప్రారంభించారు. వెయ్యి పుస్తకాలను ప్రభుత్వం ప్రయోగకాత్మకంగా అమెజాన్ ద్వారా పార్శిళ్ల నేరుగా పాఠశాలలకే చేర్పించిందన్నారు. 20 వేల పుస్తకాలను వాహనాల్లో పంపామన్నారు. శనివారం సాయంత్రానికి అన్ని పాఠశాలలకు అందేలా రూట్ మ్యాప్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 అబ్దుల్ కలాం,పాఠశాల హెచ్‌ఎం బాలసుబ్బారెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.